



అభిమానులకు అభివాదం

మీకు తోడుగా మేమున్నాం



అల్వాల గ్రామంలో కర్రెక్క చెక్కును అందజేస్తున్న భువనేశ్వరి



అగ్రహారంలో సుధాకర్‌నాయుడు భార్య రాధమ్మ, కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న భువనేశ్వరి

- ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుదాం
- కుటుంబ పెద్దను కోల్పోయామని అధైర్య పడవద్దు
- టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు నారా భువనేశ్వరి భరోసా
- రూ.3 లక్షల ఆర్థిక సాయం



గోనెగండ్ల మండలం యర్రబాడులో కౌలుట్లయ్య భార్య లక్ష్మీదేవికి చెక్కును అందజేస్తున్న భువనేశ్వరి



ముగతి గ్రామంలో నాగరాజు భార్య లలితాంబను ఓదార్చుతూ..

కర్నూలు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి)/ఎమ్మిగనూరు: 'మీకు తోడుగా మేమున్నాం.. అధైర్య పడవద్దు.. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుదాం..' అంటూ టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి బాధిత కుటుంబా లకు భరోసా ఇచ్చారు. రెండో రోజు ఎమ్మిగనూరు నియోజకవర్గంలో చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన ఐదుగురు టీడీపీ కార్యకర్తల కుటుంబాల ఇళ్లకు వెళ్లారు. వారి కుటుంబ సభ్యులతో కొంత సమయాన్ని గడిపి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లల చదువుల వివరాలు తెలుసుకొని వారి భవిష్యత్తు ప్రణాళిక ఏమిటో విచారించారు. భావోద్వేగానికి లోనైన టీడీపీ కార్యకర్తల కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధిత కుటుంబ సభ్యులు కన్నీరు పెడితే భువనేశ్వరి కూడా కంటతడి పెట్టారు. ఎమ్మిగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి బీవీ జయనాగేశ్వరరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడుతో కలిసి ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చెక్కును అందించారు. ఐదు బాధిత కుటుంబాలకు మొత్తం రూ.15 లక్షల ఆర్థిక సాయం అందించారు.

భువనేశ్వరి పరామర్శించిన కుటుంబాలు..

- నందవరం మండలం మాచాపురం గ్రామంలో చంద్రబాబు అరెస్టును జీర్ణించుకోలేక టీడీపీ కార్యకర్త హనుమంతు అక్టోబరు 24న గుండెపోటుతో మృతి చెందారు. ఆ ఇంటికి భువనేశ్వరి వెళ్లి హనుమంతు కుటుంబ సభ్యుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. రూ.3 లక్షల ఆర్థిక సాయం అందించారు.
- ముగతి గ్రామంలో సెప్టెంబరు 23న టీడీపీ కార్యకర్త నాగరాజు మనోవేదనకు గురై మృతి చెందారు. ఆ కార్యకర్త ఇంటికి వెళ్లిన భువనేశ్వరిని చూడగానే నాగరాజు భార్య లలితాంబ కన్నీరు పెట్టారు. ఆ సమయంలో భువనేశ్వరి కళ్లు చెమర్చాయి. కొన్ని క్షణాలు ఏమి మాట్లాడక బాధతో ఉండిపోయారు. ఆ తర్వాత తేరుకొని 'అమ్మా కుటుంబ సభ్యులను కోల్పోతే ఆ బాధ ఎలా ఉంటుందో మాకు తెలుసు.. ధైర్యంగా ఉండు.. మేము ఉన్నామంటూ' భరోసా ఇచ్చారు. ఆర్థిక సాయం చెక్కు అందజేశారు. ఈ సమయంలో లలితాంబ మాట్లాడుతూ ఓ తల్లిలా మా ఇంటికి వచ్చి మా యోగ, క్షేమాలు తెలుసుకొని ధైర్యం చెప్పడం మరువలేమని అన్నారు.
- గోనెగండ్ల మండలం అగ్రహారం గ్రామంలో సెప్టెంబరు 12న టీడీపీ కార్యకర్త సుధాకర్‌నాయుడు మృత్యువాత పడ్డారు. వారి ఇంటికి నారా భువనేశ్వరి వెళ్లి సుధాకర్ నాయుడు భార్య రాధమ్మ, కుటుంబ సభ్యులను ఓదార్చారు. నారా కుటుంబం మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆర్థిక సహాయం చెక్కును అందజేశారు.
- గోనెగండ్ల మండలం అల్వాల గ్రామంలో సీనియర్ టీడీపీ కార్యకర్త ఆరెకంటి ఈరన్న సెప్టెంబరు 10న మృతి చెందారు. భువనేశ్వరి ఈరన్న ఇంటికి వెళ్లి ఆయన భార్య కర్రెక్కను పరామర్శించారు. రూ.3లక్షల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా కర్రెక్క మాట్లాడుతూ 'అమ్మా నా భర్త ఎప్పుడూ టీడీపీ కోసమే పనిచేశారు. చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక చనిపోయారు' అంటూ కంటతడి పెట్టారు. మీరు రావడం కొండంత ధైర్యాన్ని ఇచ్చిందని అన్నారు.



నందవరం మండలం మాచాపురంలో చెక్కును అందజేస్తూ...

- గోనెగండ్ల మండలం యర్రబాడు గ్రామంలో సెప్టెంబరు 18వ తేదీన టీడీపీ కార్యకర్త కౌలుట్లయ్య చంద్రబాబు అక్రమ అరెస్టు తట్టుకోలేక గుండెపోటుతో మృతి చెందారు. కౌలుట్లయ్య భార్య లక్ష్మీదేవి కుటుంబ సభ్యులను నారా భువనేశ్వరి ఓదార్చారు. పిల్లలను దగ్గరకు చేర్చుకొని ధైర్యం చెప్పారు. రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. పార్టీ అండగా ఉటుందని భరోసా ఇచ్చారు.

● వెల్లువలా తరలి వచ్చిన అభిమానులు

నిజం గెలవాలి యాత్రలో భాగంగా రెండో రోజు నారా భువనేశ్వరి ఎమ్మిగనూరు టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డితో కలిసి ఆ నియోజకవర్గంలో పర్యటించారు. పల్లె పల్లెనా అభిమానులు వెల్లువలా తరలివచ్చి స్వాగతం పలికారు. ఆదోని నుంచి బయలుదేరిన భువనేశ్వరి ఉదయం 10 గంటలకు ఎమ్మిగనూరు మండలం కొటేకల్లుకు రాగానే.. మాజీ ఎంపీపీ శంకరయ్య, కొటేకల్లు, దేవిబెట్ట టీడీపీ నాయకులు నీలి నాగయ్య, సోమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వందలాది మంది టీడీపీ కార్యకర్తలు రోడ్డుపైకి వచ్చారు. దీంతో భువనేశ్వరి కారు ఆపి వారిని ఆప్యాయంగా పలకరించారు. యాత్ర సాగిన నందవరం, మాచాపురం, ముగతి, గోనెగండ్ల మండలం అగ్రహారం, గంజహళ్లి, గోనెగండ్ల, కులుమాల, చిన్నమర్రివీడు, అల్వాల, పిల్లిగుండ్ల, నెరడుప్పల, యర్రబాడు గ్రామాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు రోడ్లపైకి వచ్చి భువనేశ్వరికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి బీవీ జయనాగేశ్వరరెడ్డి, మంత్రాలయం, పాణ్యం, ఆలూరు, ఆదోని టీడీపీ ఇన్‌చార్జిలు పాలకుర్తి తిక్కారెడ్డి, కోట్ల సుజాతమ్మ, గౌరు చరిత, కె.మీనాక్షినాయుడు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముగతి ఈరన్నగౌడు, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ పుష్పావతి, టీడీపీ నాయకులు గుడిసె కృష్ణమ్మ, వైకుంఠం ప్రసాద్, వైకుంఠం జ్యోతి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మాదవరావ్ దేశాయ్, గోనెగండ్ల సర్పంచ్ హైమావతి, మాజీ వైస్ ఎంపీపీ రఘుమూర్తి స్వామి, ఎమ్మిగనూరు మాజీ ఎంపీపీ వాల్మీకి శంకరయ్య, కొటేకల్లు ఖాజా, సోమేశ్వరరెడ్డి, భార్గవ్, అల్వాల సర్పంచ్ బాషా, మాచాపురం కాశింవలి, చిన్నరాముడు, మురళి, కడిమెట్ల సురేంద్రరెడ్డి, మల్లికార్జున, నజీర్, అల్తాఫ్, ముగతి మాజీ సర్పంచ్ బాలరాజు, గోనెగండ్ల ఎన్సీ రామాంజనేయులు, రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌పై తిరుగుబాటు

- వైసీపీ పాలనపై విసుగెత్తిపోతున్న ప్రజలు
- మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి



కానాలలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి

సంజామల, జనవరి 10: 'రాష్ట్రంలో జగన్ పని అయిపోయింది. ఆయనపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది' అని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. బుధవారం సంజామల మండలంలోని కానాల గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అనుసరిస్తున్న విధానాలతో పేద, మధ్యతరగతి ప్రజలు విసుగెత్తిపోయారని అన్నారు. వైసీపీ నాయకుల్లో ఓటమి భయం పట్టుకుందన్నారు. ఒక్కచాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ ప్రజలపై పన్నుల భారం వేయడంతో పేదలు ఆర్థికంగా చితికిపోతున్నారని తెలిపారు. ఉత్తమ భవిష్యత్‌కు చంద్రబాబు ప్రజలకు గ్యారెంటీ ఇస్తుంటే... సీఎం జగన్ మాత్రం ప్రజా ఆస్తులను దోచుకోవడంలో గ్యారెంటీ ఇస్తున్నారని విమర్శించారు. జగన్ తన అధికారాన్ని నిలబెట్టుకోవడానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నాడని, ఇప్పటికే పరిస్థితి ఆయన చేయి దాటిపోయిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు కేశవరెడ్డి, శేషారెడ్డి, పార్థసారథి రెడ్డి, మోహన్‌రెడ్డి, బాలతిమ్మయ్య, నారాయణరెడ్డి, నాగూర్‌భాష, హుసేన్‌బాషా, తలారి వెంకటేశ్వర్లు, నాగరాజు, బాబయ్య, మహేంద్ర, కిరణ్, సురేంద్ర పాల్గొన్నారు.

గోపూజ మహిమాన్వితం

● ప్రవచనకర్త బ్రహ్మర్షి చాగంటి కోటేశ్వరరావు



ప్రవచనాలు వినేందుకు హాజరైన కర్నూలు ప్రజలు



కర్నూలు(కల్చరల్), జనవరి 10: గోమాతను పూజిస్తే సకల దేవతలను పూజించినట్లేనని, కలియుగంలో గోపూజ మహిమాన్వితమైనదని ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు భక్తులకు ఉద్బోధించారు. కర్నూలు జిల్లా కేంద్రంలో రెండు రోజుల పాటు 'చాగంటి కోటేశ్వరరావు ప్రవచనామృతం' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నగరంలో బళ్లారి చౌరస్తా సమీపంలోని ఏపీఎస్పీ బెటాలియన్‌లోగల టీజీ వెంకటేశ్ అవుట్ డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. తొలిరోజు బుధవారం సాయంత్రం చాగంటి కోటేశ్వరరావు 'గోమాత వైభవం' అనే అంశంపై ప్రవచనాలు చెప్పారు. సృష్టిలో పరమభాగవోత్తములు భగవంతుడి దర్శనం కోరుకున్నప్పుడు ఆయన ఏదో ఒక అవతార రూపాల్లో దర్శనం ఇస్తారన్నారు. సకల సృష్టికి మూలమైన జగన్మాత మూడు రూపాల్లో దర్శనమిస్తుందని గోమాత, భూమాత, జగన్మాతగా ఆమెను భక్తులు దర్శించుకునే అవకాశం ఉందన్నారు. భక్తులు సులువుగా పూజించే మార్గాల్లో గోప్రదక్షిణ ఒకటని, గోపూజలకు సమయం, సందర్భం అంటూ ఏదీ లేదని చెప్పారు. గోపూజ గురించి పంచమ వేదమైన మహాభారతంలో భీష్మాచార్యులు అనేక విషయాలు చెప్పారని అన్నారు. శాంతి, అనుశాసైనిక పర్వాల్లో గోమాత గురించి గొప్పగా వర్ణన ఉందని తెలిపారు. ఇదిలా ఉండగా రెండు రోజుల ఆధ్యాత్మిక ప్రవచనాలు ఇచ్చేందుకు కర్నూలుకు వచ్చిన చాగంటి కోటేశ్వరరావు దంపతుల ను యువ నాయకుడు, టీజీ గ్రూప్స్ జూనియర్ చైర్మన్ టీజీ భరత్ కలిసి పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు, దేవాలయాల కమిటీ ప్రతినిధులు, భక్తులు, చాగంటి అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీజీవీ యూత్ సభ్యులు, బెటాలియన్ పోలీసు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం ప్రవచనామృతం కార్యక్రమంలో భాగంగా 'జగన్మాత వైభవం' అనే అంశంపై చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు చెబుతారు.

'ప్రభుత్వాన్ని దించుతాం'

నంద్యాల (నూనెపల్లె), జనవరి 10: విద్యాశాఖలోని సమగ్ర శిక్ష వివిధ విభాగాలలో పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చకపోతే ప్రభుత్వాన్ని దించుతామని సమగ్ర శిక్షా జేఏసీ నాయకులు ఇదయతుల్లా, సీఐటీయూ నాయకులు నాగరాజు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం నంద్యాలలోని దీక్షా శిబిరంలో ఉద్యోగులు తలకిందులుగా నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే ప్రభుత్వాన్ని కూడా తలకిందులు చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లు గడుస్తున్నా హామీలను నెరవేర్చకపోవడం దౌర్భాగ్యమని అన్నారు. నిరవధిక సమ్మె నీరు గార్చేందుకు ప్రభుత్వం నోటీసులు, జీవోల ద్వారా బెదిరిస్తోందని, అయినా తాము భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. హామీల మేరకు సమగ్ర శిక్షా ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.



నంద్యాలలో నిరవధిక సమ్మెలో సమగ్ర శిక్ష ఉద్యోగులు

సభ సూపర్ హిట్

- స్వచ్ఛందంగా తరలి వచ్చిన తెలుగు తమ్ముళ్లు
- అరెస్టు తర్వాత బాబుపై సానుభూతి
- ఆళ్లగడ్డ సభ అందుకు నిదర్శనమంటున్న పరిశీలకులు
- విజయవంతం కావడంతో చంద్రబాబు ఖుషీ



మంగళవారం జరిగిన నంద్యాల బహిరంగ సభకు భారీగా తరలివచ్చిన ప్రజలు

నంద్యాల, ఆంధ్రజ్యోతి: 'సభకు వచ్చిన జన సునామీని చూసి తాడేపల్లి పిల్లి వణికిపోతోంది. వచ్చే ఎన్నికల్లో నంద్యాల జిల్లాలోని 7 అసెంబ్లీ స్థానాలను టీడీపీ గెలుస్తుంది'. ఇదీ నిన్నటి ఆళ్లగడ్డ 'రా.. కదలి రా!' సభ సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మాట్లాడిన మాటలు. సభకు తరలిన జనాన్ని చూస్తే చంద్రబాబు మాట్లాడిన మాటల్లో ఏమాత్ర అతిశయోక్తి లేదనిపిస్తోంది. సభ అనగానే మందు, బిర్యాని, డబ్బులు ఇచ్చి మనుషులను తరలించడమనే మాటలే వినిపిస్తాయి. కానీ నిన్నటి సభకు వచ్చిన వారిలో చంద్రబాబు, టీడీపీ మీద ఉన్న అభిమానంతో స్వచ్ఛందంగా తరలినవారే అధికం. ఆయా నియోజకవర్గాల నుంచి టీడీపీ నాయకులు తరలించిన సంఖ్య కంటే రెండింతల మంది ఎవరికి వారు సొంత ఖర్చులు భరించుకుని వచ్చారు. చంద్రబాబు అరెస్టు తర్వాత జిల్లా ప్రజల్లో పెల్లుబికిన సానుభూతికి తోడు, ప్రభుత్వం మీద వ్యతిరేకత సభకు భారీ స్థాయిలో జనం వచ్చేలా చేసిందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

● ఫుల్ జోష్‌లో టీడీపీ నేతలు

మాజీ సీఎం చంద్రబాబు నాయుడు అరెస్టును జిల్లా ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. స్కిల్ డెవలప్‌మెంటు ద్వారా ఎంతో మంది శిక్షణ పొంది ఉద్యోగాలు సాధిస్తే చంద్రబాబును అరెస్టు చేయడమేంటన్న ప్రశ్న తలెత్తింది. ఈ నేపథ్యంలో చంద్రబాబుపై ప్రజల్లో విపరీతమైన సానుభూతి వచ్చిందన్న అభిప్రాయం జనాల్లో వినిపించింది. నిన్నటి ఆళ్లగడ్డ సభలో అదే నిరూపితమైంది. చంద్రబాబు సభ సూపర్ హిట్ కావడంతో టీడీపీ శ్రేణుల్లో ఎంత ఉత్సాహం నిండగా వైసీపీ నాయకుల్లో అంత నిస్తేజం అలుముకుంది. చంద్రబాబు నాయుడిని నంద్యాల జిల్లా కేంద్రంలో అరెస్టు చేసినప్పుడు పెద్దగా స్పందన లేదని, ఆళ్లగడ్డలో పెట్టే సభ కూడా అలాగే అవుతుందని వైసీపీ నాయకులు భావించారు. అయితే వారి అంచనాలు తలకిందులు చేసేలా ప్రజలు సభకు భారీగా తరలి వచ్చారు. దీంతో మళ్లీ తామే గెలవబోతున్నామని భావిస్తున్న వైసీపీ ప్రజాప్రతినిధుల్లో ఆందోళన మొదలైంది. చంద్రబాబు నాయుడు సభ విజయవంతం కావడంతో టీడీపీ నేతలు ఫుల్ జోష్‌లో ఉన్నారు.

● ఈ నాయకులు పట్టు సాధించేనా..?

జిల్లాలోని ఆ రెండు నియోజకవర్గాల నాయకులు పట్టు సాధించలేకపోతున్నారన్న అభిప్రాయం ఉంది. ఒకటికి రెండు గ్రూపులు ఉండడంతో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం లేదని తెలుస్తోంది. ఓ నియోజకవర్గ నేత ద్వితీయ శ్రేణి నాయకులకు కనీస మర్యాద ఇవ్వడం లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. వారిని కలిసేందుకు ఇంటికి వచ్చే నాయకులు, పార్టీ తరపున పని చేసే టీమ్ వారిని కూడా సరిగా పట్టించుకోరన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తనకు టికెట్ ఇవ్వరన్న అపనమ్మకంతో ఇలా వ్యవహరిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక పార్లమెంటు స్థాయి నాయకుడైతే అసలు ఉన్నాడా అన్న అనుమానం అందరికీ కలుగుతోంది. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులకు గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, తేలిగ్గా తీసుకుంటే మాత్రం ఓటమి చవిచూడక అభిప్రాయం వినిపిస్తోంది.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

అడుక్కుతినే స్థాయికి దిగజార్చారు..

- నంద్యాలలో కార్మికుల భిక్షాటన
- 15వ రోజు మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె



నంద్యాలలో భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

నంద్యాల టౌన్, జనవరి 10: రాష్ట్రంలోని మున్సిపల్ కార్మికులందరినీ అడుక్కుతినే స్థాయికి వైసీపీ ప్రభుత్వం దిగజార్చిందని సీఐటీయు, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన దీక్షతో పాటు భిక్షాటనతో జగన్ ప్రభుత్వ తీరుపై మండి పడ్డారు. సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి మహమ్మద్ గౌస్, కార్మికుల సంఘం నాయకులు కృష్ణయ్య, భాస్కరాచారి, తదితరుల ఆధ్వర్యంలో నిరసన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో, చాలీచాలని వేతనాలతో కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నారని విమర్శించారు. ప్రజారోగ్యం కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి కార్మికులు విధులు నిర్వహిస్తుంటే, గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ళ కాలాన్ని తాత్సారం చేయడం దుర్మార్గమని అన్నారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే ఏఐటీయూసీ, మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సంఘం ఆధ్వర్యంలో 9వ రోజు డిమాండ్ల సాధన కోసం కార్మికులు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, పట్టణ అధ్యక్షుడు డి.శ్రీనివాసులు, కార్యదర్శి భూమని శ్రీనివాసులు పాల్గొన్నారు.

చీపుర్లతో మున్సిపల్ కార్మికుల ర్యాలీ

ఆత్మకూరు : తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మున్సిపల్ కార్మికులు చేపడుతున్న నిరసనలు 16 రోజులుగా కొనసాగుతున్నాయి. బుధవారం పట్టణంలో మున్సిపల్ కార్మికులు చీపుర్లు చేతబూని నిరసన ర్యాలీ చేపట్టారు. అలాగే స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట కేజీరోడ్డుపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు రజాక్, రామ్‌నాయక్, రణధీర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, గొడుగు రాజు



ఆత్మకూరులో చీపుర్లతో ర్యాలీ చేస్తున్న పారిశుధ్య కార్మికులు

సంక్రాంతి పండుగకు ప్రత్యేక బస్సులు

ఆత్మకూరు, జనవరి 10: సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల సౌకర్యార్థం ఆత్మకూరు ఆర్టీసీ డిపో తరుపున హైదరబాద్ నుంచి మూడు ప్రత్యేక బస్సు సర్వీసులను సాధారణ చార్జీలతో నడుపుతున్నట్లు డిపో మేనేజర్ మహేంద్రుడు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11, 12, 13 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ నుంచి రాత్రివేళల్లో 10, 11, 12గంటలకు బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈబస్సు సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు చెప్పారు. ఆత్మకూరు నుంచి కర్నూలు, నంద్యాల రూట్లలో కూడాసాధారణ చార్జీలతో బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అందుకు తగ్గట్టుగా బస్సు సర్వీసులను సిద్ధం చేస్తామని అన్నారు. మరిన్ని వివరాల కోసం 08517-224000కు సంప్రదించాలని సూచించారు.

సంక్రాంతి కానుకను పంపిణీ చేయాలి

ఆత్మకూరు, జనవరి 10: సంక్రాంతి కానుకను వెంటనే పంపిణీ చేయాలని సీపీఎం నాయకులు రణధీర్, సురేంద్ర, రామ్‌నాయక్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పేద వర్గాలను దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వాలు సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ పండుగలకు నిత్యావసర సరుకులతో కూడిన కిట్లను పంపిణీ చేసేవారని గుర్తుచేశారు. ఇదేతరహాలో వైసీపీ ప్రభుత్వం సంక్రాంతి కానుకగా కందిబేడలు, బెల్లం, గోధుమపిండి, పామాయిల్, పసుపు, కారం, చింతపండు, నెయ్యి తదితర నిత్యావసర సరుకులను పౌర సరఫరాల శాఖ ద్వారా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు ఇస్మాయిల్, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

మండల స్థాయి క్రీడలు ప్రారంభం



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న సర్పంచు, ఎంపీడీఓ

పగిడ్యాల, జనవరి 10: పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండలస్థాయి క్రీడా పోటీలను సర్పంచు శేషన్న, ఎంపీడీవో వెంకటరమణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో నిర్వహించిన వివిధ క్రీడలలో రాణించిన క్రీడాకారులకు మండల స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు ఎలాంటి గొడవలకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో పోటీలు నిర్వహించుకోవాలన్నారు. ఎంపీపీ మల్లీశ్వరి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టరు రమాదేవి, మాజీ జడ్పీటీసీ పుల్యాలనాగిరెడ్డి, తహసీల్దార్ భారతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల కోసమే వైద్య శిబిరాలు



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా

ఆత్మకూరు, జనవరి 10: పేద ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్న ఉద్దేశ్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట పట్టణంలో వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా తెలిపారు. బుధవారం కొత్తపేట సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష -2 కార్యక్రమాన్ని వారు సందర్శించారు. అక్కడ ప్రజలకు అందిస్తున్న వైద్యసేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్ వారు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

30వ రోజు



నంద్యాల నిరవధిక దీక్షా శిబిరంలో అంగన్‌వాడీలు

- పోరాటం వీడే ప్రసక్తే లేదు : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్
- జిల్లా వ్యాప్తంగా వినూత్న నిరసనలు
- బండిఆత్మకూరులో ఎంపీ, ఎమ్మెల్యేల నిలదీత
- ఆత్మకూరులో ఉరితాళ్లు బిగించుకొని నిరసన
- జూపాడుబంగ్లాలో మోకాళ్లపై ఆందోళన
- ఎస్మా జీవోను వెనక్కి తీసుకోవాలంటూ డిమాండ్

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరవధిక దీక్షలు

ఆత్మకూరు, జనవరి 10: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేస్తున్న నిరవధిక నిరాహారదీక్షలు బుధవారానికి 30వ రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగానే స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని నిరసన దీక్షా శిబిరం వద్ద వారు ఉరితాళ్లతో నిరసన తెలిపారు. అనంతరం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు మంజుల, లక్ష్మీదేవీ, ప్రమీలమ్మ, సీఐటీయూ నాయకులు రామ్‌నాయక్, రణధీర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీలు తమ డిమాండ్ల సాధన కోసం 30 రోజులుగా నివరధిక సమ్మె చేస్తున్నప్పటికీ సీఎం జగన్ స్పందించకపోవడం సరికాదని అన్నారు. అంగన్‌వాడీల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేవరకూ పోరాటం వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. యూనియన్ నాయకులు సుధారాణి, లక్ష్మీ, ప్రియాంక, రవణమ్మ, అరుణ, విజయలక్ష్మీ, లక్ష్మీదేవీ, సుజాత తదితరులు ఉన్నారు.

ప్రభుత్వానికి కనువిప్పు కలగాలి

నంద్యాల నూనెపల్లె : అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేవిధంగా ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తోటమద్దులు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల అన్నారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీల అమలుకు చేపట్టిన నిరవధిక సమ్మె 30వ రోజుకు చేరుకుంది. బుధవారం దీక్షా శిబిరంలో రిలే దీక్షల్లో భాగంగా అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మోకాళ్లపై అంగన్‌వాడీలు నిరసన

జూపాడుబంగ్లా : అంగన్వాడీ వర్కర్స్ తమ న్యాయమైన కోరికలు వెంటనే అమలు చేయాలని డిమాండు చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. ప్రభుత్వం అంగన్వాడీలపై ప్రయోగించిన ఎస్మా జీవోను వెంటనే వెనక్కి ఉపసంహరించుకోవాలని డిమాండు చేశారు. జగన్ ఎన్ని కుయుక్తులు పన్నినా సమ్మెను విరమించేదీ లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక జిల్లాకార్యదర్శి ఖాజాహుసేన్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కర్ల, యూనియన్ నాయకులు వెంకటరమణమ్మ, పద్మావతి, ప్రసన్న పాల్గొన్నారు.

ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

వెలుగోడు : అంగన్వాడీ వర్కర్ల సమస్యల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని కోరుతూ సమ్మె 30 రోజులకు చేరడంతో అంగన్‌వాడీలు ముగ్గులు వేసి నిరసన తెలిపారు. వెలుగోడు పట్టణంలో నిరసన దీక్షలు చేస్తున్న అంగన్వాడీలకు ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, నాగేంద్రుడు, సీఐటీయూ నాయకులు మహమ్మద్‌రఫీ, సంఘీభావం తెలిపారు.

ఎంపీ, ఎమ్మెలల నిలదీత

బండిఆత్మకూరు : అంగన్వాడీల సమస్య అయిపోయింది కదా అని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. బుధవారం బండిఆత్మకూరులో పలు



శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పాను అడ్డుకున్న అంగన్వాడీలు

అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు వచ్చిన ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికు అంగన్వాడీల నిరసన సెగ తగిలింది. తహసీల్దార్ కార్యాలయం గుండా వెళ్తున్న ఎంపీ, ఎమ్మెల్యేల కాన్వాయ్‌ను అంగన్వాడీలు అడ్డుకున్నారు. చేసేదీమీ లేక ఎమ్మెల్యే శిల్పా దిగివచ్చి అయిపోయిందికదా... అని చెబుతూ ముందుకు సాగారు. వెంటనే అంగన్వాడీ వర్కర్లు 'మీపనా, మా పనా అయిపోయింది' అని వ్యంగంగా అంటూ వచ్చే ఎన్నికల ఫలితాల గురించి పరోక్షంగా స్పందించారు. ఎంపీ పోచా బ్రహ్మనందరెడ్డి మాత్రం కారులో నుంచి కిందకు దిగిరాక పోవటం గమనార్హం.







ఆత్మకూరులో ఉరితాడు బిగించుకొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు, వెలుగోడులో సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీలు, జూపాడుబంగ్లాలో ఒంటికాలిపై నిలిచి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

గ్రీన్‌కో సోలార్ కంపెనీకి భూములు ఇవ్వం

- తేల్చి చెప్పిన పాతపాడు, మీరాపురం రైతులు

నంద్యాల (కల్చరల్), జనవరి 10: గ్రీన్‌కో సోలార్‌కు భూముల ఇచ్చేది లేదని పాతపాడు, మీరాపురం రైతులు తేల్చిచెప్పారు. ఈ మేరకు బుధవారం జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ పొలాల్లో రెండు పంటలు పండుతాయని, బోర్లలో నీరు పుష్కలంగా ఉన్నాయని తమ భూములను సోలార్ కంపెనీకి ఇచ్చే ప్రసక్తే లేదని రైతులు తెలిపారు. బనగానపల్లె మండలంలోని పాతపాడు,యాగంటి దేవస్థానాల మధ్య గ్రీన్‌కోలార్ కంపెనీ ప్లాంటును ఏర్పాటు చేస్తుందన్నారు. కటికవానికుంట, పసుపుల గ్రామాలలో 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు కంపెనీ ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ కంపెనీ పాతపాడు, మీరాపురం గ్రామాలకు చెందిన 200 ఎకరాల్లో సోలార్ ప్లాంటును ఏర్పాటు చేయాలనుకుంటోందని, దానికిగాను సర్వే చేస్తున్నారని పేర్కొన్నారు. పొలాలను ఇస్తే జీవనోపాధికోల్పోతమని రైతులు జేసీకి విన్నవించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ



జేసీతో మాట్లాడుతున్న పాతపాడు, మీరాపురం రైతులు

వీటిని పరిశీలించేందుకు డోన్ ఆర్డీఓకు పంపామని ఆర్డీఓ సర్వే నిర్వహించి నివేదిక ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో పాతపాడు,మీరాపురం గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

సఫాయి కర్మచారుల జీవన ప్రమాణాలు పెంచండి

నంద్యాల (కల్చరల్), జనవరి 10: సఫాయి కర్మచారుల జీవన ప్రమాణాలను పెంపొందించడంతో పాటు వారి సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సఫాయి కర్మచారుల జాతీయ కమిషన్ సభ్యులు డాక్టర్ పి.పి. వవ జిల్లా యంత్రాంగానికి సూచించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సఫాయి కర్మచారుల కోసం జిల్లా యంత్రాంగం అమలుచేస్తున్న పథకాలపై మున్సిపల్ కమిషనర్లు, కార్మికశాఖ, సంబంధిత అధికారులతో కమిషన్ సభ్యులు సమీక్షించారు. వీరికి కనీస వేతనాలు, వైద్య శిబిరాలు తప్పక



మాట్లాడుతున్న జాతీయ కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వవ,

ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి, జాతీయ సఫాయి కర్మచారుల కమిషన్ మెంబర్ అడ్వైజర్ గిరింధర్, మెంబర్ కోఆర్డినేటర్ సందీప్‌చరణ్, డీఆర్‌ఓ పుల్లయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ సఫాయి కర్మచారులకు ప్రధానమంత్రి ఆవాస్ యోజనక్రింద గృహాలు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.

ఆర్థిక ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

నంద్యాల (కల్చరల్), జనవరి 10: ఆర్థిక ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి ప్రజల సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తామని ఏపీ అసెంబ్లీ ఎస్టిమేట్స్ కమిటీ చైర్‌పర్సన్, పాలకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ ఎస్టిమేట్స్ కమిటీ సమావేశాన్ని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి నిర్వహించారు. డీఆర్‌ఓ పుల్లయ్య, ఏపీ అసెంబ్లీ అసిస్టెంట్ సెక్రటరీ బిక్షం, సెక్షన్ ఆఫీసర్ కాశిరెడ్డి, ఎఎస్‌ఓ ఉమేష్ చంద్ర జిల్లా అధికారులు తదితరలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వసరాయి కళావతి మాట్లాడుతూ పంచాయతీరాజ్, ఇరిగేషన్, వ్యవసాయం, నీటిపారుదల శాఖలకు సంబంధించిన బడ్జెట్ ఎస్టిమేట్స్ అడిగి తెలుసుకుంటూ క్షేత్రస్థాయిలో తలెత్తే ఆర్థిక ఇబ్బందుపై పరిశీలిస్తామన్నారు. కాంట్రాక్టర్లు జాప్యం చేయకుండా పనులు సకాలంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ బీడు భూములకు అవసరమైన నీటిని కేటాయించి రైతుల నుంచి వాటర్‌ట్యాక్స్ వసూలు చేయాలని సూచించారు. పంచాయతీ



మాట్లాడుతున్న అసెంబ్లీ ఎస్టిమేట్స్ కమిటీ చైర్‌పర్సన్ విశ్వసరాయి కళావతి

రాజ్‌శాఖ ఎస్ఈ రామచంద్రారెడ్డి, సోషల్‌వెల్ఫేర్ డీడీ చింతామణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, డీపీఓ మంజులవాణి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి తదితరులు క్షేత్రస్థాయిలో చేపడుతున్న పనులు, నెలకొన్న ఇబ్బందులను గురించి కమిటీ చైర్‌పర్సన్ దృష్టికి తెచ్చారు. ఈ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కమిటీ చైర్‌పర్సన్ అధికారులకు తెలిపారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

గడివేముల, జనవరి 10: మండలంలోని పెసరవాయి గ్రామంలో కౌలు రైతు పురుగు మందు తాగి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. పెసరవాయి గ్రామానికి చెందిన పెద్దగోకారి(65) 30 ఎకరాలు పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసేవాడు. 30 ఎకరాల్లో మిరప, జొన్న పంటలను సాగు చేశాడు. పంటలు సరిగా రాకపోవడంతో పెట్టిన పెట్టుబడి రాక అప్పులపాలయ్యాడు. మనస్తాపం చెంది ఈ నెల 2న పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు ఆసుపత్రికి తరలించగా బుధవారం కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు అండగా నిలిచేది టీడీపీనే

గడివేముల, జనవరి 10: రైతులకు అండగా ఉంటూ వారి అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేశారని పాణ్యం నియోజకవర్గ టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు కృష్ణయాదవ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సాగునీరు ఇవ్వలేని పరిస్థితుల్లో వైసీపీ ప్రభుత్వం ఉందని అన్నారు. ఈ ప్రభుత్వంలో రైతులకు సబ్సిడీపై విత్తనాలు కూడా ఇవ్వలేదని అన్నారు. రైతులకు అండగా నిలవని వైసీపీ నాయకులు కూడా చంద్రబాబును విమర్శించడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. దయ్యాలు వేదాలు వల్లించినట్లు వైసీపీ నాయకులు మాట్లాడుతున్నారని అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో రైతులకు సబ్సిడీపై ఎరువులు, సూక్ష్మ పోషకాలు, విత్తనాలు అందించారని అన్నారు. రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించే స్థాయి వైసీపీ నాయకులకు లేదని అన్నారు.

స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు



పల్లకి సేవను నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలం, జనవరి 10: శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం బుధవారం మూలానక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు ఊయలసేవ, పల్లకీ ఉత్సవాన్ని దేవస్థానం ఘనంగా నిర్వహించింది. పూజా కార్యక్రమంలో ముందుగా మహాగణపతి స్వామికి పూజలు జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊయలలో ఆశీనులనుజేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామపూజలు, స్వామివారికి సహస్రనామార్చన పూజలు నిర్వహించి మంగళహారతులను సమర్పించారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

బండిఆత్మకూరు, జనవరి 10 : మండలంలోని ఏ కోడూరు, బండిఆత్మకూరు గ్రామాల్లో రూ. 2 కోట్ల అభివృద్ధి పనులకు ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ భరత్ కుమార్‌రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. బుధవారం ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, సర్పంచు జ్ఞానాభరణం ఆధ్వర్యంలో ఏ కోడూరులో ఆర్బీకే, మినరల్ వాటర్ ప్లాంట్, జీసీ రోడ్డ, పాల కేంద్రం, ఆరోగ్యకేంద్రాలను ప్రారంభించారు. అనంతరం బండిఆత్మకూరులో సచివాలయం 2, ఆర్బీకే, కాలువలను వారు ప్రారంభించారు.

సమస్యల 'కొత్తపల్లి'

- అభివృద్ధికి ఆమడ దూరంలో మండల కేంద్రం
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఆందోళనలో గ్రామస్థులు

కొత్తపల్లి, జనవరి 10: కొత్తపల్లి మండల కేంద్రమైనప్పటికీ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. 35 ఏళ్ల క్రితమే కొత్తపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేసినప్పటికీ మారుమూల పల్లెలకన్నా అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. మండలానికి 12 గ్రామ పంచాయతీలతోపాటు 18 మజరా గ్రామాలున్నాయి. గ్రామాలే కొద్దో గొప్పో అభివృద్ధి చెందుతున్నప్పటికీ మండల కేంద్రం కొత్తపల్లిని మాత్రం పట్టించుకునే అధికారులు, పాలకులే లేరని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. కొత్తపల్లి మేజర్ గ్రామ పంచాయతీ కావడంతో 4,800 జనాభాతో పాటు సుమారు 13 కుటుంబాలున్నాయి. మండల కేంద్రం కావడంతో అన్ని రకాల ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. నిత్యం పలు గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం ఇక్కడికి వస్తుంటారు. కనీస సౌకర్యాలు



లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ వీధి చూసినా బురదమయం. ప్రధాన రహదారులతో పాటు బీసీ, ఎస్సీ, ఓసీ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం బురదలోనే తిరగాల్సిన పరిస్థితి ఉందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. వర్షం నీటితో పాటు గృహాల్లోని నీరు ప్రధాన వీధుల్లో పారుతూనే ఉంటుంది. వీధుల్లో పారిశుధ్యం లోపించి రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామస్థులు భయాందోళనలు చెందుతున్నారు.

← బురదమయంగా గ్రామంలోని రహదారి

చేసిన పనులకే బిల్లులు ఇవ్వడం లేదు

రెండేళ్ల క్రితం కొత్తపల్లిలో వివిధ అభివృద్ధి పనులు చేశాం. వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. సుమారు రూ.7 లక్షలకు పైగా ఖర్చు చేసి రైతుభరోసా కేంద్ర నిర్మాణం, రెండు తాగునీటి బోర్లు, పైపులైన్ నిర్మాణం, బోర్ల మరమ్మతులు చేయించాం. ఇంతవరకు వాటికి బిల్లులు చెల్లించలేదు. పనుల కోసం తెచ్చిన అప్పులు తీర్చలేకపోతున్నాం. ప్రభుత్వం ఏమైనా నిధులు ఇస్తే కొత్తపల్లి అభివృద్ధికి కేటాయిస్తాం.

- లక్ష్మీదేవి సర్పంచు

గుమ్మనూరుకు షాక్..!



- మంత్రికి ఆలూరు టికెట్ నిరాకరణ
- సీఎం జగన్‌ను కలిసిన తరువాత మారిన సమీకరణలు
- వైసీపీ అభ్యర్థిగా చిప్పగిరి జడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి
- మంత్రి జయరామ్‌కు కర్నూలు ఎంపీ టికెట్
- నేడు అధికారికంగా ప్రకటించే అవకాశం
- బీసీ మహిళ కప్పట్రాళ్ల బొజ్జమ్మకు మొండిచేయి


మంత్రి జయరాం


విరుపాక్షి


కపట్రాళ్ల బొజ్జమ్మ

కర్నూలు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. వైసీపీ టికెట్ కోసం స్థానిక ఎమ్మెల్యే మంత్రి గుమ్మనూరు జయరాం సహా పలువురు పోటీ పడ్డారు. అయితే ఆలూరు వైసీపీ సమన్వయకర్త (రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి)గా చిప్పగిరి జడ్పీటీసీ సభ్యుడు బి. విరుపాక్షిని సీఎం జగన్ ఎంపిక చేశారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా పోటీ చేసి రెండు సార్లు విజయం సాధించిన గుమ్మగనూరును ఆలూరు బరి నుంచి తప్పించారు. ఇది ఆయన వర్గీయులకు మింగుడు పడటం లేదు. 'బొజ్జమ్మ తల్లీ ఎలా ఉన్నావ్.. ఇన్నాళ్లకు వచ్చావు.. ఆలూరు చూసుకో తల్లి..' అంటూ ఆప్యాయంగా పలకరించి టికెట్ ఇస్తామని నమ్మించి చివరికు సీఎం జగన్ నయవంచన చేయడంతో కప్పట్రాళ్ల బొజ్జమ్మ వర్గీయులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. బుధవారం విజయవాడలో తాడేపల్లి సీఎం క్యాంప్ ఆఫీసులో సీఎం జగన్‌ను మంత్రి గుమ్మనూరు జయరాం, జడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి కలిశారు. ఆలూరు నియోజకర్గం ఎమ్మెల్యే టికెట్ విరుపాక్షికి, కర్నూలు ఎంపీ టికెట్ జయరాంకు ఇస్తున్నాం.. ఇద్దరు కలసి సమన్వయనంతో పని చేసుకోమని చెప్పి పంపించినట్లు విశ్వసనీయ సమాచారం. వారితో తక్కువ సమయమే మాట్లాడినా ఇద్దరికీ టికెట్లపై స్పష్టత ఇచ్చి పంపించారు. మంగళవారం ఉదయమే తాడేపల్లికి రావాలని మంత్రి జయరాం, విరుపాక్షిలకు పిలుపువచ్చింది. బుధవారం సాయంత్రం 4 గంటలకు సీఎం జగన్‌ను కలిశారు. అయితే తాడేపల్లి నుంచి పిలుపు రాగానే మంత్రి వర్గీయులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మంత్రి జయరాం లేదా ఆయన తనయుడు ఈశ్వర్‌కు టికెట్ ఇవ్వాలని, కాదని ఎవరికి ఇచ్చినా పని చేయమంటూ ధిక్కారస్వరం వినిపించినా ఫలితం లేకుండాపోయింది. టికెట్ రేసులో విరుపాక్షినే పైచేయి సాధించారు. నేడు అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

● విరూపాక్షి వర్సెస్ జయరాం

మంత్రి జయరాం, జడ్పీటీసీ సభ్యుడు బి. విరుపాక్షి ఇద్దరికి చిప్పగిరి మండలమే. అదే మండలం నుంచి జడ్పీటీసీగా విజయం సాధించి.. ఆ తరువాత ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసే స్థాయికి ఎదిగిన వారే. 2014, 2019 రెండు ఎన్నికల్లోనూ జయరాం గెలుపు కోసం విరుపాక్షి పని చేశారు. 2021లో స్థానిక సంస్థల ఎన్నికల్లో చిప్పగిరి జడ్పీటీసీగా పోటీ చేసి విరుపాక్షి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విరుపాక్షి రాజకీయంగా ఎదుగుతాడనో ఎక్కడ తనకు పోటీ అవుతాడనే భయమో.. తెలియదు కాని చిప్పగిరి వైసీపీ కన్వీనర్‌గా తన తమ్ముడు గుమ్మనూరు నారాయణస్వామికి ఎంపిక చేసి అధికార పెత్తనం అంతా ఆయన చేతిలో పెట్టాడు మంత్రి జయరాం. జడ్పీటీసీ సభ్యుడుగా ఉన్న విరుపాక్షిని మండలంలో జరిగే అధికార కార్యక్రమాలకు సైతం ఆహ్వానం ఉండేది కాదు. ఇద్దరి మధ్య రాజకీయ వైరం తారాస్థాయికి చేరింది. విరుపాక్షి వర్గీయులపై దాడులు కూడా చేశారని అంటున్నారు. రాజకీయ వేధింపులు తట్టుకోలేని విరుపాక్షి నేనెందుకు ఎమ్మెల్యేగా పోటీ చేయకూడదు..? అనే అభిప్రాయానికి వచ్చారు. గతేడాది ఫిబ్రవరిలో వైసీపీకి రాజీనామా చేయాలనే ఆలోచన కూడా చేశారు. ఆ సమయంలో ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, వైసీపీ రీజినల్ ఇన్‌చార్జిలు రాంసుబ్బారెడ్డి, కడప జడ్పీ చైర్మన్ ఆకేపోగు అమర్నాథరెడ్డి విరుపాక్షిని పిలిపించి మాట్లాడారు. ఆ రోజు నుంచి అధిష్ఠానంతో పరిచయాలు పెంచుకున్న ఆయన వ్యూహాత్మకంగా పావులు కదిపారు. చివరికి రాజకీయంగా తనను తొక్కేయాలని చూసిన వైరివర్గీయులనే తొక్కేసి ఎమ్మెల్యే టికెట్ సాధించారు. మంత్రి జయరాంతో రాజకీయ వైరం విరుపాక్షికి కలిసొచ్చిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అయితే.. ఎన్నికల్లో విరుపాక్షికి మంత్రి వర్గీయులు సహకరిస్తారా..? లేదా అన్నది వేచి చూడాల్సిందే.

● బొజ్జమ్మను నమ్మించి వంచించిన జగన్

మాజీ జడ్పీటీసీ సభ్యురాలు కప్పట్రాళ్ల బొజ్జమ్మకు టీడీపీలో సీనియర్ నాయకురాలిగా గుర్తింపు ఉండేది. ఆలూరు టీడీపీ టికెట్ కోసం కూడా ఆమె ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. దివంగత టీడీపీ నేత కప్పట్రాళ్ల వెంకటప్ప నాయుడు కుమార్తెగా గ్రామాల్లో గుర్తింపు ఉంది. అదే సమయంలో మంత్రి గుమ్మనూరు జయరాంకు ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత దృష్ట్యా రాబోయే ఎన్నికల్లో టికెట్ ఇచ్చేది లేదని ఆరు నెలల క్రితమే జగన్ స్పష్టత ఇచ్చారు. ఈ క్రమంలో వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన టీడీపీ నాయకురాలు బొజ్జమ్మను వైసీపీలోకి లాగేందుకు ఎత్తులు వేశారు. వైసీపీ తరఫున పని చేస్తున్న ఐప్యాక్ టీం బొజ్జమ్మ ఇంటికి వెళ్లి పలుమార్లు చర్చలు జరిపారు. వైసీపీ అధిష్ఠానం పెద్దలు, ప్రభుత్వ పెద్దలతో మాట్లాడించారు. చివరికి జగన్ దృష్టికి తీసుకెళ్లి టికెట్ ఖాయం అని నమ్మించారు. జూన్ 19న తాడేపల్లి సీఎం క్యాంప్ ఆఫీసుకు పిలిపించారు. ఆమె మెడలో వైసీపీ కండువా వేసి ఆహ్వానించాడు. అదే వేదికపై ఉన్న మంత్రి గుమ్మనూరుతో 'బొజ్జమ్మ ఆలూరు చూసుకుంటుంది.. నీవు కర్నూలు చూసుకో..' అని సీఎం జగన్ చెప్పడమే కాకుండా బొజ్జమ్మ, ఆమె భర్త మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడుకు బందోబస్తు కల్పిస్తూ గన్‌మెన్లను కేటాయించారు. బొజ్జమ్మకే వైసీపీ టికెట్ అని అందరు భావించారు. జగన్ తియ్యటి మాటలు వెనుక విషం దాగి ఉందని తెలిశాక బొజ్జమ్మ వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎం జగన్ నయవంచన చేశారని ఆవేదన చెందుతున్నారు. ఈ నెల 5న సీఎం జగన్‌కు బొజ్జమ్మ, జయరాం కలిశారు. ఆ సమయంలో మహిళలకు ప్రాధాన్యత ఉంటుందని చెప్పిన ముఖ్యమంత్రి మోసం చేశాడని బొజ్జమ్మ వర్గీయులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. బీసీ మహిళలకు జగన్ ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ ఆలూరు నియోజకవర్గంలో ఇది చర్చనీయాంశమైంది.

మల్లన్న సన్నిధిలో అంచనాల కమిటీ చైర్‌పర్సన్

- క్షేత్ర అభివృద్ధి, భక్తుల సౌకర్యాలపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న కళావతి

శ్రీశైలం, జనవరి 10: శ్రీశైలం దేవస్థానంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను బుధవారం రాత్రి ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ అంచనాల కమిటీ చైర్‌పర్సన్ ఎంపీ కళావతి సమీక్షించారు. స్థానిక భ్రమరాంబ అతిథి గృహంలో జరిగిన ఈ సమావేశంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు, దేవస్థానం పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు. సమావేశంలో ఆలయ ఈవో పెద్దిరాజు భక్తులకు కల్పిస్తున్న దర్శనం, వసతి, అన్నప్రసాద వితరణ, వాహనాల పార్కింగ్, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వైద్యసేవలు, గో సంరక్షణ, ఆగమ పాఠశాల నిర్వహణతోపాటు దేవస్థానంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి అంచనాల కమిటీ చైర్‌పర్సన్‌కు వివరించారు. ఈ సందర్భంగా అంచనాల కమిటీ చైర్‌పర్సన్ ఎంపీ కళావతి మాట్లాడుతూ క్షేత్రాన్ని సందర్శించే మల్లన్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించాలన్నారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు, ఉగాది మహోత్సవాలు, మొదలైన పర్వదిన రోజులలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని ఆ సమయంలో భక్తుల సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశానంతరం అంచనాల కమిటీ చైర్‌పర్సన్ స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అంతకముందు శ్రీశైలం చేరుకున్న ఆమెకు ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

ద్విచక్ర వాహనం బోల్తా పడి వ్యక్తి మృతి

మంత్రాలయం, జనవరి 10: మండలంలోని మాధవరం చెక్‌పోస్టు సమీపంలో ద్విచక్ర వాహనం బుధవారం రాత్రి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మంత్రాలయం రాఘవేంద్రపురానికి చెందిన వడ్డె శేఖర్(28) అనే వ్యక్తి మృతి చెందాడు. శేఖర్ బేల్దార్ పని ముగించుకొని కర్ణాటక నుంచి సొంత గ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా రాయచూర్ రోడ్డులోని చెక్‌పోస్టు వద్ద బోల్తా పడింది. దీంతో శేఖర్‌కు తలకు దెబ్బతినడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య గాయత్రి కొడుకు, కూతురు ఉన్నారు. మాధవరం ఎస్ఐ కిరణ్ బాబు ఘటనా స్థలానికి చేరుకుని మృతుని వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబానికి సమాచారం అందించారు. శేఖర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

కాల్ మనీ ఆత్మహత్య

- అప్పు, వడ్డీ చెల్లించాలని బెదిరించిన వైసీపీ మాజీ కౌన్సిలర్
- సెల్ఫీ వీడియో తీసుకుని రైలు కిందపడి బలవన్మరణం


మృతి చెందిన హరికృష్ణ

నంద్యాల క్రైం, జనవరి 10 : నంద్యాల పట్టణంలో కాల్ మనీకి యువకుడు బలయ్యాడు. రూ.10 వడ్డీకి అప్పు ఇచ్చిన మహిళ తీవ్రస్థాయిలో వేధించడంతో భరించలేక రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియోలో బాధితుడి మాటలు సోషల్ మీడియా లో చర్చనీయాంశమయ్యాయి. నంద్యాల నూనెపల్లెలోని మారుతీ నగర్‌కు చెందిన హరికృష్ణ (36) నంద్యాల మున్సిపాల్టీలో కాంట్రాక్టు పద్ధతిన పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మృతుడి భార్య ఆరేళ్ల క్రితం మరణించింది. వీరికి ఇద్దరు సంతానం. తన ఇంటి అవసరాలకు నంద్యాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దళితవాడకు చెందిన వైసీపీ నాయకురాలు, మాజీ కౌన్సిలర్ కన్నమ్మ వద్ద నూటికి రూ.10వడ్డీతో రూ.3 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఆర్థిక పరిస్థితి సరిగాలేక మూడు నెలల నుంచి వడ్డీ చెల్లించలేకపోయాడు. అప్పు ఇచ్చిన మహిళ నిరంతరం వేధించడం, తన అనుచరులతో బెదిరించడంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు హరికృష్ణ సెల్ఫీ వీడియోలో మాట్లాడాడు. అప్పు, వడ్డీ తప్పనిసరిగా చెల్లిస్తానని చెప్పినా బెదిరింపులకు పాల్పడటంతో చేసేదేమీలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని, ఇందుకు కన్నమ్మే కారణమని వీడియోలో మాట్లాడాడు. ఆ తర్వాత మహానంది మండలం నందిపల్లె సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆందోళనకు దిగారు. ఇదిలా ఉండగా తన కొడుక్కు గత కొంతకాలంగా మానసిక స్థితి సరిగాలేదని, అందుకే ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి వీరప్ప రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్సై జలీల్ తెలిపారు.

డిగ్రీలో ఆరుగురి డీబార్

కర్నూలు(అర్బన్), జనవరి 10: రాయలసీమ యూనివర్సిటీలో జరిగిన 1, 5 సెమిస్టర్ పరీక్షల్లో ఆరుగురు విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 16 పరీక్షా కేంద్రాల్లో 1వ సెమిస్టర్లో 5941కి 5368, 5వ సెమిస్టర్‌కు 5778 మంది దరఖాస్తు చేసుకోగా 5313 మంది పరీక్షలకు హాజరై పరీక్షలు రాశారని పేర్కొన్నారు.

రేపటి నుంచి శ్రీశైలంలో

సంక్రాంతి బ్రహ్మోత్సవాలు

ఆర్జిత సేవలు నిలుపుదల


విద్యుద్దీపాలంకరణలో శ్రీశైలం ఆలయం

శ్రీశైలం, జనవరి 10: శ్రీశైల మహాక్షేత్రంలో మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని ఈ నెల 12 నుంచి 18 వ తేదీ వరకు సంక్రాంతి బ్రహ్మోత్సవాలను దేవస్థానం వైభవంగా నిర్వహించనుంది. ఏడురోజులపాటు ఈ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. సంక్రాంతి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆయా ఏర్పాట్లను పూర్తిచేశారు. 12వ తేదీ శుక్రవారం ఉదయం 8:30 గంటలకు స్వామివారి యాగశాల ప్రవేశంతో ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. 13వ తేదీన భృంగివాహనసేవ, 14న రావణవాహనసేవ, 15వ తేదీ మకరసంక్రాంతి పర్వదినం రోజున నందివాహనసేవ, స్వామి, అమ్మవార్లకు బ్రహ్మోత్సవ కల్యాణం, 16న కైలాసవాహనసేవ, 17న యాగపూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూలస్నానం, సదస్యం, నాగవల్లి, ధ్వజావరోహణ కార్యక్రమాలు, 18న తేదీన రాత్రి జరిగే పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవలతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఈ నెల 12 నుంచి 18 వరకు ఆర్జిత, ప్రత్యక్ష, పరోక్షసేవలైన రుద్రహోమం, చండీహోమం, మృత్యుంజయహోమం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం, స్వామి, అమ్మవార్ల కల్యాణం, ఏకాంతసేవలను నిలుపుదల చేశారు.

వైసీపీకి షాక్

- పార్టీకి ఎంపీ సంజీవకుమార్ రాజీనామా
- మరోసారి టికెట్ ఇవ్వకపోవడంతో నిరాశ



కర్నూలు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్న వేళ వైసీపీకి ఊహించని షాక్ తగిలింది. బీసీలలో బలమైన చేనేత సామాజిక వర్గానికి చెందిన కర్నూలు వైసీపీ ఎంపీ డాక్టర్ ఎస్. సంజీవకుమార్ ఆ పార్టీకి, ప్రాథమిక సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేశారు. రాబోయే ఎన్నికల్లో కర్నూలు పార్లమెంట్ స్థానం నుంచి మరోసారి పోటీ చేసేందుకు ఆయన ఆసక్తి చూపారు. తన రాజకీయ భవితవ్యాన్ని తేల్చుకోవడానికి వైసీపీ అధినేత సీఎం జగన్‌ను కలిసేందుకు పలుమార్లు ప్రయత్నించారు. నెలలు గడచినా కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు. ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, సీఎంవో ఓఎస్‌డీ ధనుంజయరెడ్డిలను కలిసేందుకు చేసిన ప్రయత్నాలు కూడా విఫలమయ్యాయి. కనీసం ఫోన్ కూడా తీయకపోవడంతో మనస్తాపానికి గురైన డాక్టర్ సంజీవ కుమార్ ఆ పార్టీకి రాజీనామా చేశారు.

● తొలిసారిలోనే ఎంపీగా విజయం

కర్నూలు నగరంలో ఆయుస్మాన్‌భవ ఆస్పత్రి అధినేత అయిన డాక్టర్ సంజీవ కుమార్ 2019 ఎన్నికలకు ముందు రాజకీయాల్లోకి వచ్చారు. ఎంపీగా గెలిచి పార్లమెంట్‌లో అడుగు పెట్టారు. కర్నూలు పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నా ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా ఆయనను ఎంపీగా గుర్తించలేదు. బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం వల్లే ఎంపీగా గుర్తించలేదని ఆయన సన్నిహితులు ఆవేదన చెందిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా ఒక్క కర్నూలు మినహా ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో ఎంపీగా ఆయనను ఆహ్వానించిన సందర్భాలు కూడా తక్కువే. ఇదే విషయాన్ని ఒకట్రెండు సార్లు సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కూడా ఎమ్మెల్యేలు ఎలా చెబితే.. అలా వినాలని చెప్పినట్లు తెలుస్తోంది. అలాగే పార్లమెంట్‌లో ప్రశ్నలు అడగాలన్నా రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి అనుమతి తీసుకోవాల్సి ఉండేదని ఆయన వర్గీయులు చెబుతున్నారు. దీనికితోడు ఈ సారి మరో వ్యక్తికి టికెట్ ఇవ్వాలన్న ఆలోచనలో అధిష్ఠానం ఉందని తెలిసి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ మేరకు వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. టీడీపీలో చేరే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

సన్నిహితులతో చర్చించి భవిష్యత్తు నిర్ణయం
- డాక్టర్ సంజీవ కుమార్

ఎంపీగా గెలిచాక నాలుగున్నర ఏళ్లలో సీఎం జగన్‌ను రెండు సార్లు మాత్రమే కలిసే అవకాశం వచ్చింది. ఎంపీగా కర్నూలు పార్లమెంట్‌లో అనుకున్న అభివృద్ధి పనులు చేయలేకపోయాను. ఆ విషయాలను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తే.. అభివృద్ధి పనులు ఎమ్మెల్యేలు చూసుకుంటారు.. నీకెందుకు అంటూ సమాధానం ఇచ్చారు. మరో వ్యక్తికి ఎంపీ టికెట్ ఇస్తారని తెలిసింది. పార్టీ నుంచి నాకు నేరుగా ఎలాంటి సమాచారం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీలో ఉండడం సరికాదని రాజీనామా చేశాను.

అవన్నీ కేంద్ర పథకాలే

- కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ బాగేల్


మెడికల్ కాలేజీ ప్లాన్‌ను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి

ఆదోని టౌన్, జనవరి 10 : రాష్ట్రంలో అనేక పథకాలు కేంద్ర నిధులతోనే అమలవుతున్నాయని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ బాగేల్ అన్నారు. బుధవారం ఆయన ఆదోని పట్టణంలో పర్యటించి వివిధ కార్యక్రమాలలో పాల్గొన్నారు. పట్టణానికి పది కిలోమీటర్ల దూరంలోని అరేకల్ గ్రామ సమీపంలో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల నిర్మాణం పనులను ఆయన పరిశీలించి పనులలో నాణ్యతను పాటించాలని అధికారులకు ఆదేశించారు. పట్టణంలో నూతన పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. గత నాలుగేళ్లుగా దేశ వ్యాప్తంగా పేదలకు ఉచితంగా బియ్యం సరఫరా చేయడంతో పాటు, ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందాలనే ఉద్దేశంతో ఆయుష్మాన్‌భవ పథకాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు కునిగిరి నాగరాజు, గోవిందరాజులు గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీరాములు, కో కన్వీనర్ నాగరాజ్ గౌడ్, పట్టణం అధ్యక్షుడు సాయి, వడ్డే వెంకటేష్, ఆచారి, ఆదూరి విజయ కృష్ణ, పాల్గొన్నారు.

పథకాలను అందజేయడానికే వికసిత్ యాత్ర

హొళగుంద, జనవరి 10 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలల్లో అవగాహన కల్పించడానికే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర చేపట్టామని కేంద్ర ఆరోగ్య సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ బాగేల్ అన్నారు. హొళగుంద మండలంలోని గజ్జెహళ్లి గ్రామంలో సర్పంచ్ అరుబొట్ల నాగమ్మ అధ్యక్షతన జరిగిన వికసిత్ భరత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడతూ మోదీ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యునతికి తోడ్పాటు అందిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, జడ్పీ సీఈవో నసారా రెడ్డి, డీఆర్‌డీఏ సలీం, ఎమ్మార్వో హుస్సేన్ సాబ్, ఎంపీడీఓ సుహాసినమ్మ, ఈవోపీఆర్డీ చంద్రమౌళీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

ఇళ్లకు వంద శాతం కేంద్ర ప్రభుత్వ నిధులు

నందవరం /ఎమ్మిగనూరు టౌన్, జనవరి 10: రాష్ట్రంలో పేదల కోసం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద మంజూరైన 25లక్షల గృహాలకు వందశాతం కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తుందని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా ఏమి లేదని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖమంత్రి సత్యపాల్ సింగ్ బాగేల్ పేర్కొన్నారు. బుధవారం వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆయన ఎమ్మిగనూరు నియోజకవర్గంలో పర్యటించారు. నందవరంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ దేశంలోని పేద ప్రజల సంక్షేమం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, వాటిని సద్వినియోగం చేసుకొని అభివృద్ధిలోకి రావాలని అన్నారు. మరుగుదొడ్లు, బియ్యం, గోధుమలు వంటివి కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్నదని అన్నారు. జన్‌ధన్ కింద బ్యాంకుల్లో అకౌంట్లు ఉన్నందు వల్ల 55కోట్ల మంది ఖాతాల్లో నేరుగా కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన పథకాల డబ్బు చేరుతున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కనిగిరి నీలకంఠ, కేశవస్వామి, బీఎల్ నారాయణ, కిరణ్‌కుమార్, బనవాసి రాముడు పాల్గొన్నారు.

వైసీపీ అక్రమాలను ఆధారాలతో నిరూపిస్తాం : టీడీపీ


విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఓర్వకల్లు, జనవరి 10: పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సహకారంతో ఓర్వకల్లు మండలంలో వైసీపీ నాయకులు చేసిన అక్రమాలను ఆధారాలతో నిరూపిస్తామని టీడీపీ మండల కన్వీనర్ గోవింద రెడ్డి అన్నారు. ఓర్వకల్లులో టీడీపీ మండల నాయకులు బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గోవిందరెడ్డి మాట్లాడుతూ ఓర్వకల్లులో 1725 రేషన్ కార్డులు ఉంటే జగనన్న కాలనీలో రెండు వేల నాలుగు వందలు పట్టాలు ఎవరికి ఇచ్చారో వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. 202 సర్వే నెంబరులో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని పట్టాలు పుట్టించుకున్నారని ఆరోపించారు. టీడీపీ నాయకుడు చదువుల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ తాను వైసీపీని వీడితే తమ పంటలో ఓ చీడ పురుగు పోయిందని కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్ రెడ్డి అన్నారని, నిజానికి మండలంలో చీడ పురుగు ఎవరో ప్రజలందరికీ తెలుసన్నారు. గ్రామంలో టీడీపీ హయాంలో సర్వే నెంబరు 151లోని 10 ఎకరాల భూమిలో 2 సెంట్లు చొప్పున 420 ప్లాట్లు వేసి లేఅవుట్ తయారు చేయగా 124 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారని అనివార్య కారణాల వల్ల ప్లాట్లు పంపిణీ చేయలేదన్నారు. పట్టాల పంపిణీ చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా కాలయాపన చేస్తున్నారన్నారు. కాల్వబుగ్గ చైర్మన్ చెన్నారెడ్డికి తనను విమర్శించే స్థాయి లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి నాయకులు చింతలపల్లె గ్రామ సర్పంచ్ వెంకట రమణ, టీడీపీ నాయకుడు లక్ష్మీకాంత రెడ్డి, సుధాకర్ రావు, మౌళీశ్వర రెడ్డి, రామాంజనేయులు, నాగరాజు, సుధాకర్, రామకోటేశ్వర రావు, విజయుడు, శ్రీనివాసులు, తిరుపాలు, శివుడు తదితరులు పాల్గొన్నారు.

30వ రోజు సమ్మె

వైసీపీకి భవిష్యత్తు లేదు: సుబ్బారెడ్డి



సుబ్బారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

డోన్, జనవరి 10: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీకి భవిష్యత్తు లేదని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని చనుగొండ్ల గ్రామంలో వైసీపీకి చెందిన రామాంజినేయులు, బ్రహ్మయ్య, లక్ష్మన్న, సీలప్ప, లక్ష్మణస్వామి, శ్యామ్, రాంబాబు, డీలర్ లింగయ్యతో పాటు మరో వంద కుటుంబాలు సుబ్బారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైసీపీ అస్తవ్యస్త పాలనతో విసిగిన పార్టీ కార్యకర్తలే టీడీపీతోనే మంచి భవిష్యత్తు ఉంటుందన్న నమ్మకంతో వస్తున్నారన్నారు. సీఎం జగన్ పన్నుల భారం మోపి ప్రజలను పీడిస్తున్నారన్నారు. పచ్చని రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు పెరిగినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ప్రజల నుండి వస్తున్న నిరసనలతో వైసీపీ నాయకులకు దిక్కు తోచడం లేదన్నారు. డోన్ నియోజకవర్గంలో టీడీపీ గెలుపు కలసి కట్టుగా పని చేసి చంద్రబాబును సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, పార్టీ పరిశీలకుడు కాటమయ్య, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులుయాదవ్, దేవరబండ వెంకటనారాయణ, గోవిందు, న్యాయవాది హరూన్, కాశీవిశ్వనాథ్, సర్పంచ్ రామిరెడ్డి, మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య, ఎల్ఐసీ శ్రీరాములు, శేఖరయ్య పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

ప్యాపిలి: మండలంలోని కలచట్ల గ్రామంలో బుధవారం టీడీపీ సీనియర్ నాయకుడు రామచంద్రుడు మృతికి ఆ పార్టీ డోన్ ఇన్‌చార్జి సుబ్బారెడ్డి నివాళి అర్పించారు. గ్రామానికి వెళ్లి భౌతికకాయానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు చిన్న సుంకయ్య, ప్రసాద్‌రెడ్డి, కలచట్ల ప్రసాద్, బాలరంగన్న, మద్దిలేటి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌ను కలిసిన ఇరిగెల రాంపుల్లారెడ్డి



పవన్‌కళ్యాణ్‌ను కలిసిన ఇరిగెల రాంపుల్లారెడ్డి

ఆళ్లగడ్డ, జనవరి 10: జనసేన పార్టీ ఆళ్లగడ్డ నాయకుడు రాంపుల్లారెడ్డి బుధవారం మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పార్టీని ముందుకు తీసుకెళ్లడం, ఆళ్లగడ్డ తాలుకాలో పార్టీ పరిస్థితి, రాబోయే రోజుల్లో జనసేనను బలోపేతం చేసే అంశాలను చర్చించినట్లు రాంపుల్లారెడ్డి తెలిపారు. జున్ను ప్రసాదరెడ్డి ఉన్నారు.

అంగన్‌వాడీ వర్కర్లకు నోటీసులు



అల్లూరులో అంగన్‌వాడీ కార్యకర్త ఇంటికి నోటీసులు అంటిస్తున్న వీఆర్వో, కార్యదర్శి

ఉయ్యాలవాడ, జనవరి 10: సమ్మె చేస్తున్న మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లకు, ఆయాలకు షోకాజు నోటీసులు జారీ చేశారు. తహసీల్దారు ఆదేశాల మేరకు మండలంలోని వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఐదు పేజీలతో కూడిన షోకాజు పత్రాలను వారి ఇళ్లకు అంటించారు. నోటీసులు తీసుకోవటానికి కార్యకర్తలు, ఆయా నిరాకరించటంతో వారి ఇళ్లకు, అంగన్‌వాడీ భవనాలకు అంటించారు. దీనిపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దీప్తిని వివరణ కోరగా నోటీసు ఇచ్చిన మాట వాస్తవమేనని నోటీసులు అందిన 10 రోజుల్లో విధులకు హాజరు అవ్వాలని, లేకపోతే వివరణ ఇచ్చుకోవాలని ఆమె తెలిపారు. మండలంలోని 29 కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న 57 మందికి నోటీసులు ఇచ్చినట్లు ఆమె తెలిపారు.

మున్సిపల్ కార్మికుల భిక్షాటన



ఆళ్లగడ్డలో భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆళ్లగడ్డ, జనవరి 10: ఆళ్లగడ్డ పట్టణంలో మున్సిపల్ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. బుధవారం మున్సిపల్ కార్మికులు భిక్షాటన చేశారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్ మొండి వైఖరి విడనాడాలన్నారు.

నేటి నుంచి ప్రత్యేక బస్సులు

కోవెలకుంట్ల, జనవరి 10: సంక్రాంతికి కోవెలకుంట్ల నుంచి హైదరాబాదుకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు కోవెలకుంట్ల ఆర్టీసీ డిపో మేనేజరు తిరుపతయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి ఈనెల 13 వరకు కోవెలకుంట్లకు చెందిన ఆర్టీసీ బస్సులు హైదరాబాద్ నుంచి కోవెలకుంట్లకు నడుపుతున్నామని చెప్పారు. తిరిగి 16వ తేదీ కోవెలకుంట్ల నుంచి హైదరాబాద్‌లోని బీహెచ్‌ఈఎల్ వరకు నడపనున్నట్లు వివరించారు. 11న రెండు బస్సులు, 12న 5 బస్సులు, 13న 4 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. తిరిగి 16వ తేదీ నుంచి బీహెచ్‌ఈఎల్‌కు 2 బస్సులు నడుపుతున్నట్లు వెల్లడించారు. చార్జీలు పెంచడం లేదని చెప్పారు. రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. రాను పోను రిజర్వేషన్ చేసుకుంటే పది శాతం రాయితీ కల్పించనున్నట్లు తెలిపారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

కోవెలకుంట్ల ఆర్టీసీ డిపో పరిధిలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం తిరుపతయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ డిపో పరిధిలోని ప్రయాణికులు తమ సమస్యలను ఆర్టీసీ బస్సులకు సంబంధించిన సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఉదయం 11 నుంచి 12 వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో 9959225798 నెంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.



చాగలమర్రిలో నిరాహార దీక్షకు మద్దతు తెలుపుతున్న టీడీపీ నాయకులు



ఆళ్లగడ్డలో..



డోర్నిపాడులో..



రుద్రవరంలో..

ఆళ్లగడ్డ, జనవరి 10: అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం 30వ రోజు కొనసాగింది. డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మె చేస్తామని అంగన్‌వాడీలు అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె కొనసాగించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

చాగలమర్రి: తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం చాగలమర్రి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరాహార దీక్ష ద్వార నిరసన చేశారు. 30 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయం అన్నారు. సమస్య పరిష్కరించే వరకు దీక్ష కొనసాగిస్తామన్నారు. ఈ సమ్మెకు టీడీపీ, ప్రజా సంఘాలు సంఘీభావం ప్రకటించారు.

● న్యాయమైన డిమాండ్ కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు, హెల్పర్ల సమస్య పరిష్కారంపై స్పందించకపోవడం అన్యాయమని టీడీపీ నంద్యాల బీసీసెల్ స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, పట్టణ ఉపాధ్యక్షుడు ముల్లా శ్యాబుల్ ఆరోపించారు. 30వ రోజులు బుధవారం రాత్రి అంగన్‌వాడీలు నిరాహారదీక్ష చేపట్టడంతో వారికి సంఘీభావం తెలిపారు. సమ్మె చేస్తున్న శిబిరంలో టీడీపీ నాయకులు బైఠాయించారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి ఆ హామీని మరిచారని, మహిళలని చూడకుండా వేధింపులకు గురి చేయడం సిగ్గుచేటని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొలిమిసోను, సుబ్బారావు, భాస్కర్‌రెడ్డి, ఓబులేసు, మహబూబ్‌బాషా, అబ్దుల్లా, షరిఫ్, బాలకృష్ణ, బషీర్, మహబూబ్‌బాషా, చోటు తదితరులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ సిబ్బంది బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. 30 రోజులుగా అంగన్‌వాడీ సిబ్బంది దీక్షను కొనసాగిస్తున్నారు. కళ్లకు గంతలు కట్టుకొని అంగన్‌వాడీ కార్యకర్తలు తమ నిరసనను చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని హెచ్చరించారు.

శిరివెళ్ల: ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాటం సాగిస్తామని అంగన్‌వాడీలు తెలిపారు. శిరివెళ్లలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద 30వ రోజు కళ్లు మూసుకుని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు బుధవారం నిరసన వ్యక్తం చేశారు.

● వెంకటాపురం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త నిరవధిక దీక్ష వద్ద స్పృహ కోల్పోయారు. సహచర మహిళలు ఆమెకు ప్రథమ చికిత్స నిర్వహించడంతో కోలుకున్నారు.

రుద్రవరం: ఎస్మా చట్టం షోకాజ్ నోటీసుల పేరుతో ఉద్యమాన్ని ఆపలేరని అంగన్‌వాడీ కార్యకర్తల నాయకులు మనోజా, పద్మావతి, తిరుపాలమ్మ, బీబీ అన్నారు. బుధవారం నిర్వహించిన నిరసన 30వ రోజుకు చేరింది. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం దౌర్జన్యంగా అంగన్‌వాడీ సెంటర్లకు తాళాలు పగలగొట్టి సచివాలయ సిబ్బందితో విధులు నిర్వర్తించడం, చివరికి రెవెన్యూ అధికారులను ఇళ్ల వద్దకు పంపి నోటీసులు గోడలకు అంటించడం ఎంత వరకు సబబు అని విమర్శించారు.

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలో అంగన్‌వాడీ కార్యకర్తలు భారీగా తరలివచ్చి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఒంటికాలిపై నిలుచొని సమ్మెలో పాల్గొన్నారు. బుధవారం నాటికి పట్టణంలో అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె 30వ రోజుకు చేరుకుంది. ఈసమ్మెలో భాగంగా మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆయాలు, కార్యకర్తలు దీక్ష శిబిరం వద్ద సమ్మె 30 రోజులుగా సాగుతుండడంతో 30 సంఖ్య వచ్చే విధంగా కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ నాయకురాలు రోజారమణి మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి వెంటనే న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలన్నారు.. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె కొనసాగుతుందని పేర్కొన్నారు.

సంజామల: సంజామల మండలంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఒంటి కాలిపై నిరసన వ్యక్తం చేసి సమ్మెలో పాల్గొన్నారు. బుధవారం మండల కేంద్రమైన సంజామలలోని సహకారబ్యాంక్ ఆవరణంలో ఏర్పాటైన దీక్షా శిబిరంలో అంగన్‌వాడీలు 30వ రోజు సమ్మెలో పాల్గొన్నారు. మండల యూనియన్ అధ్యక్షురాలు, సుజాత మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను అంగీకరించకపోగా సమ్మెను నీరుకారుస్తూ ఎస్మా చట్టాన్ని ప్రయోగించారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



బనగానపల్లెలో ఒంటికాలిపై నిరసన



సంజామలలో..



శిరివెళ్లలో స్పృహ తప్పిన అంగన్‌వాడీ కార్యకర్తను తీసుకెళ్తున్న తోటి సిబ్బంది

నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలి: టీడీపీ



బనగానపల్లె: కొండపేటలో ప్రచారం చేస్తున్న బీసీ ఇందిరమ్మ



చాగలమర్రి: కొత్తపల్లెలో పాల్గొన్న టీడీపీ నాయకులు

బనగానపల్లె, జనవరి 10: అరాచక, నిరంకుశ పాలన సాగిస్తున్న వైసీపీకి తగిన గుణపాఠం చెప్పాలని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ పిలుపునిచ్చారు. బనగానపల్లె పట్టణంలోని కొండపేటలో బుధవారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేనిఫెస్టో గురించి వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఇందిరమ్మ మాట్లాడుతూ టీడీపీ విజయం సాధిస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. టీడీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు 2 సెంట్ల ఇంటి పట్టాలు ఇప్పించి ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యావసర వస్తువుల ధర, విద్యుత్, బస్సు చార్జీలు పెంచారని అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేస్తూ వైసీపీ ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తోందన్నారు. వైసీపీ నాయకులు ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. మహిళలకు టీడీపీ అందేంచే పథకాలను వివరించారు. నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం

బనగానపల్లె మండలంలోని రాళ్లకొత్తూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త రాజునాయక్ (45) మృతికి టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ బుధవారం సంతాపం వ్యక్తం చేశారు. రాజునాయక్ మృతదేహానికి నివాళి అర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు. రాజునాయక్ కుటుంబ సభ్యులకు టీడీపీ అండగా ఉంటుందని ఆమె తెలిపారు.

చాగలమర్రి: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, గోపాల్ అన్నారు. బుధవారం డి.కొత్తపల్లెలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆళ్లగడ్డలో జరిగిన రా..కదలిరా నినాదంతో చేపట్టిన సభతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల్లో జోష్ నింపిందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ఇదే ఉత్సాహంతో టీడీపీ జెండా ఎగరవేసేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆళ్లగడ్డ సభతో వైసీపీ శ్రేణుల్లో వణుకు పుట్టిందని అన్నారు. నాయకులు సురేష్‌కుమార్‌రెడ్డి, బాబునాయుడు, హనుమంతు, శంకర్, బాలయ్య, రమణ, బాలసుబ్బయ్య పాల్గొన్నారు.

సోలార్ ప్యానెళ్లు ధ్వంసం



దుండగులు ధ్వంసం చేసిన సోలార్ ప్యానెళ్లు

అవుకు, జనవరి 10: మండలంలోని మారెమడుగుల గ్రామంలో చిన్నపురెడ్డి అనే రైతు పొలంలో సోలార్ ప్యానెళ్లు, స్టార్టర్ బాక్సును గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం తెల్లవారుజామున ధ్వంసం చేశారు. సుమారు లక్షన్నర మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపురెడ్డి సోలార్ పంపుసెట్ ద్వారా వ్యవసాయ పొలానికి నీరు అందించేందుకు పొలంలో సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసుకున్నారు. సోలార్ పంపుసెట్ కింద 25 ఎకరాల్లో వరి, పొగాకు, మినుము పంటలు సాగు చేశారు. సోలార్ ప్యానెళ్లు ధ్వంసం కావడంతో పంటలకు సాగునీరు అందక తీవ్రంగా నష్టపోవాల్సి ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత రైతు చిన్నపురెడ్డి అవుకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆళ్లగడ్డ, జనవరి 10: నల్లగట్ల సమీపంలోని 40వ జాతీయ రహదారిలో మంగళవారం ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడిన నందింపల్లె ప్రకాష్(50) నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ప్రకాష్ ఆళ్లగడ్డ నుంచి నందింపల్లెకు మోటార్‌సైకిల్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ప్రకాష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ నరసింహులు చెప్పారు.

బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు

అవుకు, జనవరి 10: అవుకు పట్టణంలోని భారత్ గ్యాస్ గోదాము సమీపంలో బుధవారం రెండు మోటారుసైకిళ్లు ఢీకొని అవుకుకు చెందిన మహబూబ్‌బాషా, సంగపట్నానికి చెందిన మునిరెడ్డి గాయపడ్డారు. మునిరెడ్డి సంగపట్నం నుంచి మోటారు సైకిల్‌పై అవుకుకు బయలుదేరారు. మహబూబు బాషా అవుకు నుంచి కోవెలకుంట్లకు బయలుదేరారు. అవుకు పట్టణంలోని భారత్ గ్యాస్ గోదాము వద్దకు వచ్చే సరికి రెండు బైకులు ఎదురుగా ఢీకొన్నాయి. మునిరెడ్డికి కాలు, చేయి విరిగి తలకు బలమైన గాయాలయ్యాయి. మహబూబ్‌బాషా స్వల్పంగా గాయపడ్డారు. ఇరువురిని 108 వాహనంలో బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మునిరెడ్డి పరిస్థితి విషయంగా ఉండడంతో నంద్యాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'రోగుల జాబితా రోజూ అప్‌లోడ్ చేయాలి'



నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వైద్యాధికారులతో కలిసి పరిశీలిస్తున్న ప్రపంచ ఆరోగ్య సమితి బృందం సభ్యులు

రుద్రవరం, జనవరి 10: నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యం కోసం వచ్చే రోగుల జాబితా ప్రతిరోజూ టాబ్‌లో అప్‌లోడ్ చేయాలని ప్రపంచ ఆరోగ్య సమితి తరఫున వచ్చిన వైద్యాధికారి సందేశ్ అన్నారు. బుధవారం మండలంలోని నరసాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించారు. రోగులకు అందించే వైద్య సేవలు, వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యసేవలు సక్రమంగా అందించాలన్నారు. అన్ని రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన వెంట ఎన్‌క్యుయూఏఎస్ ప్రోగ్రాం మేనేజర్ లక్ష్మణ్, నాగేంద్ర, వైద్యాధికారి బాబు, సిబ్బంది ఉన్నారు.

భూ రీసర్వే అభ్యంతరాలపై దరఖాస్తుల స్వీకరణ



రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న డీటీ శ్రీనివాసరెడ్డి

చాగలమర్రి, జనవరి 10: భూ రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ సుభద్రమ్మ, డీటీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ముత్యాలపాడు గ్రామంలో గ్రామసభ నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. 114 మంది రైతులు భూరీసర్వే అభ్యంతరాలపై దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ ఈనెల 5 నుంచి గ్రామసభలు నిర్వహించామని అన్నారు. 5 గ్రామాల్లో 240 దరఖాస్తులు రైతుల నుంచి వచ్చాయని తెలిపారు. రైతులు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి తిరిగి భూరీసర్వే నిర్వహించి రైతుల సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో వీఆర్వో ప్రసాదురెడ్డి, సర్వేయర్ రసూల్, రైతులు పాల్గొన్నారు.

10 నుంచి మహా కుంభాభిషేకం

బనగానపల్లె, జనవరి 10: మండలంలోని చౌడేశ్వరీమాత ఆలయంలో అమ్మవారి మహా కుంభాభిషేకాన్ని ఫిబ్రవరి 10 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఈవో రామానుజన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. భక్తులు అందరూ ఈ కుంభాభిషేకంలో పాల్గొని విజయవంతం చేయాలని ఈవో కోరారు.

కొనసాగుతున్న ధనుర్మాస పూజలు



అహోబిలంలో ఉత్సవమూర్తులకు అభిషేకం చేస్తున్న అర్చకుడు

ఆళ్లగడ్డ, జనవరి 10: అహోబిలంలో ధనుర్మాస పూజలు కొనసాగుతున్నాయి. బుధవారం వేకువజామున్నే ఉత్సవమూర్తులైన ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతోపాటు గోదాదేవి అమ్మవారికి తిరుప్పావై, సేవాకాలం, శాత్తుముర్రై, గోష్టి కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి రంగనాధయతీంద్ర మహదేశికన్ ఉత్సవమూర్తులకు దివ్యప్రబంధ పారాయణాలు చేశారు.

చాగలమర్రిలో సీతారాములకు..



చాగలమర్రిలో సీతారాములకు పూజలు చేస్తున్న భక్తులు

చాగలమర్రి, జనవరి 10: చాగలమర్రిలోని కోదండ రామాలయంలో బుధవారం వేద పండితుల ఆధ్వర్యంలో ధనుర్మాస పూజలు వైభవంగా నిర్వహించారు. మహిళలు సీతారాములకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సామూహిక ఒడిబియ్యం కార్యక్రమం, లలిత పారాయణం, పల్లకీ ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

శబరిమలకు అయ్యప్ప భక్తులు



చాగలమర్రిలో ఇరుముడితో శబరిమలకు వెళ్తున్న భక్తులు

చాగలమర్రి, జనవరి 10: చాగలమర్రిలోని ఏకశిల పదునెట్టాంబడి అయ్యప్పస్వామి ఆలయంలో దీక్ష చేపట్టిన 40 మంది అయ్యప్ప మాలధారులు బుధవారం ఇరుముడితో శబరిమలకు బయలుదేరారు. గురుస్వాములు ఆలయంలో దీక్షదారులకు ఇరుముడి పూజలు నిర్వహించారు. అయ్యప్ప విగ్రహంతో ఊరేగింపు చేశారు.

'గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి'

చాగలమర్రి, జనవరి 10: రైతులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాదు సూచించారు. బుధవారం చాగలమర్రి, చిన్నబోదనం, పెద్దబోదనం గ్రామాల్లో గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గేదెలు, ఆవులకు, ఎద్దులకు టీకాలు వేస్తున్నామని తెలిపారు. 15 వేల పశువులకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. 31వ తేదీ వరకు గ్రామాల వారీగా టీకాలు వేస్తామని అన్నారు. రైతులు తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు.